
# గండం గడిచింది

శివల జగన్నాథరావు



"సూర్యుడు తూర్పున ఉదయించునూ... పడమటిన అస్తమించునూ ..." అని చిన్న బళ్ళో కుర్రాళ్ళకి పాఠం చెప్పేడు! ఉదయిస్తున్నప్పుడు సూర్యుణ్ని చూడలేదు, తనింతదాకాను! లేచేసరికి ఏడు!! చిన్న తనంనించీ చిన్నమ్మాయి కొడుకు నెత్తికెక్కిన్న ఈ న్న దాకా తను లేచే వేళ ఎప్పుడూ ఏడే!! ఏడుతో మొదలైన తనదినం అన్నివనుల్లోనూ ఏడుపుగొట్టు మొహంతోనే అంతమవుతోంది!! ఏడు దాటేకా లేచి, అప్పుడు ఆదరా బాదరా తెమిలి, బడికెళతాడు! బద్ధకం! ధర్మరాజుని శకుని పట్టుకున్నట్టూ— నలుడిని శని పట్టుకున్నట్టూ— అది తనని పట్టుకొని పీడిస్తోంది!! చిన్నప్పుడు తన చెయ్యి చూసీ, నాన్న స్నేహితుడు కందిగుండ అప్పలనరసయ్యగారన్నారు! 'ఆహా! వీడిదేం జాతకం! గ్రహరాజు సూర్యుడు వీణ్ని ఎంతో ఉచ్చస్థానానికి తీసుకుపోతాడు!' అని! తన ఆలోచనలు మాత్రం ఎక్కడెక్కడో హై పొజిషన్లోనే విహరిస్తాయి! వూహలు ఉచ్చస్థానంలో ఉంటే ఏం లాభం!? బద్ధకం తనని నీచస్థానంలోకి ఈడ్చేసింది!! చదువుని మెట్రిక్కుతో ఆపేసింది! రెండోక్లాసు మేస్టరు ఉద్యోగం ఒకటి ప్రసాదించింది! 'గంతకు తగ్గ బొంత' ఒకదాన్నంట గట్టింది! నిండా రెండు రూపాయలు జేబులో వేసుకు తిరిగే రోజులేని జీవితాన్ని ఇచ్చింది!! ఉదయించే సూర్యుణ్ణి చూళ్ళేని తను... జీవితంలో వెలుగుని ఎలా చూడగలుగుతాడు??!.....

ఆరోజు ఉదయం పక్కమీంద దుప్పటిలోంచిబుర్ర తియ్యకుండా ఆలోచిస్తున్న ప్రకాశం పంతులు — "యావండోయ్!" అని వంటగదిలోంచి భార్య గావుకేక దూసుకురాగానే, "లేస్తున్నానే! నువ్విప్పుడే వోసారి పిల్చావని తెలుసునే" అంటూ మంచం దిగాడు.

పెరట్లో కచికతో పళ్ళు తోముతూ వంటగది గుమ్మంలోంచి లోపలికి తొంగిచూసేడు. వంటగదంతా బీభత్సంగా ఉంది! గిన్నెలూ, ముంతలూ పరస్పరం ఢీకొంటున్నాయి! ఆఖరి పిల్లలిద్దరూ ఢీమని కొట్టుకుంటున్నారు! ఇంటావిడ మాణిక్యాంబ గొంతు పిల్లల గోలనీ,గిన్నెల మోతల్నిమించిపోయింది.

దంత ధావనం, నూతి దగ్గర స్నానం కానిచ్చి "మాణిక్యం, కాఫీయే!" అన్నాడు పంతులు. "ఆహా! ఇస్తాను! రండి!!" కటువుగా ధ్వనించింది ఇల్లాలి గొంతు! ఆ స్వరానికి లయగా గిన్నె ధఢాంగుమన్న ధ్వని!!

"పొద్దున్నే ఏవిటే ఆ గొడవా?"

ఇం టావిడ ఇవతలికి వచ్చింది.

"ఏవంటున్నారూ? నాది గొడవా? గొడవట గొడవ? గొడవెందుకు పెట్టను? ఇంటి మగాడు ఇంటిక్కావల్సినవి ఎప్పటికప్పుడు కనుక్కుని తెచ్చి పెడితే, ఎందుకు పెడతాను గొడవ??"

"ఇదిగో! నువ్వేం చెప్పదల్చుకున్నావో ఒక్క ముక్కలో చెప్పవే?! నీ భాషా ప్రావీణ్యం నామీద చూపించకు!"

"కొంపలో పంచదార అయిపోయింది!!

'ఎప్పుడూ?!'

"ఎప్పుడో అయిపోతే, నిన్నటిదాకా తవరేవిటి తాగినట్టూ? ఇవాళ లేదు. డబ్బా అంతా తడివినా చిన్న చెమ్చాడు కూడా లేదు...."

"అవుతే కాఫీ లేదన్నమాట! మరి నన్నెందుకు లేపేవ్? అసిరెమ్మలా అరిచీ?"

"వూహూ! లేవను! జోల పాడ్తాను! జోకొడ్తానేం? కాకపోతే ఏవిటా సిగ్గులేని మాట? ఇంకో గంట బజ్జుంటే ఇల్లెలా నడుస్తుందనుకున్నారూ?"

"ఎందుకు నడవదూ?"

"నడవదంటే నడవదు! మీరు తక్షణం బయటికెళ్ళి పంచదార తేకపోతే కాఫీ తయారవదు! కాఫీ తాక్కపోతే నాకు పని నడవదు! నా పని నడవకపోతే ఇల్లెలా నడుస్తుంది?.... వెళ్ళి రండి చప్పున!"

పంతులు భార్య దగ్గిరగా వెళ్ళాడు.

"మాణిక్యం! ఒకమాట చెప్తాను వింటావా?"

"వినను! నాకిప్పుడేదీ వినిపించదు! ఎవరూ కనిపించరు! అసలు నేనేం చేస్తున్నానో నాకే తెలీదు! ఆ గుక్కెడు కాఫీ పడిందాకా నాపనింతే!! మీరెళ్ళండి వూ......"

"మనం కాఫీ మానేస్తే మంచిదేనూ, మాణిక్యం! వెధవ కాఫీ తాక్కపోతే బతక లేమా, ఏవిటి? ఆదేన్నానిక్కా!పళ్ళరసమా? పోనీబలం చేస్తుందనుకుంటే మరింత పీనుగుల్లా అవడం తప్పితే....? నా జీతంలో సహం డబ్బు దీనికే! పాలకి, కాఫీగుండకి, పంచదారకీనూ!"

మాట పూర్తవకుండానే, ధఢాంగుమని ధ్వని!! వో పెనుకేక! పంతులు బట్టలేసుకుని వెండంగల్లో రోడ్డుమీద పడ్డాడు.

'పెద్ద కేకవేసి తన నిద్ర కాస్తా చెడగొట్టేసిం అసిరెమ్మ!! ఇవాళఆదివారం గదా! బడిలేదు!!హాయి ఇంకో గంట పడుకుందామనుకున్నాడు!! నిద్రహా కూడా లేదు తన జీవితానికి!!

పుస్తె కట్టించుకునే ముందు ఎవరితో శప చేసిందో? ఇవాళ్టిదాకా ఏ కొ్రంది తనని! ఇవాళేమి చచ్చిందాకాను! తప్పత్తప్పదు. నరుడా తప్పదే దుస్యంబేమి జీవనమూ?' ...

ఆచారింటికి వచ్చాడు పంతులు.

ఆ పెంకుటింటి తలుపు లేసే ఉన్నాయి. ఇ వెళ్తొచ్చినా ఇంటి తలుపులు తియ్యడేం చెప్మ వీడూ? బ్రాహ్మణ కొంపగదా? ఇంటి ముం ఓ కల్లాపి చల్లలేదు. ముగ్గుగీత లేదు అనుకున్నాడ

ఆచారీ, తనూ ఎనిమిదో ఏటినించీ స్నేహితు ఆచారి తనకంటే కాస్త ఎక్కువే చదివేడ గవర్నమెంటుగుమాస్తాగిరివెలగబెడుతున్నాడు! తలు కొడితే తీసేడు ఆచారి. 'ఏవిటిలా, వొచ్చేవు పొద్దున్నే

పంతులు కొంచెం తటపటాయించాడు చె డానికి. తర్వాత గొంతు సవరించుకున్నాడు. "ఏ లేదూ.. వెధవది! మా ఇంట్లో పంచదార కాస్తా అయిపోయింది! ఆ వెధవ కాఫీ పడక పోతే ఉండలేం మీ ఇంట్లో ఉంటే ఒక పావుకేజీ.. అహ... అం వాలు—పావుకేజీ."

"ఏదా విషయం... కూచో అలా. మా ఆవిడ్ని కనుక్కుంటానుండు."

ఆచారి లోపలికి వెళ్ళేడు. పంతులు లోపలి మాటల్ని చెవులు రిక్కించి వినసాగాడు.

"పంతులొచ్చేడే: వాళ్ళింట్లో పంచదార అయి పోయిందిట! ఒక్క పావుకేజీ .."

"చంపేసేరే!" అంటోంది ఆవిడ లోపలి.

"చచ్చేనే!" అనుకున్నాడు పంతులు ఇలా.

"కాస్త చూడవే! పంతులు ఎప్పుడోగానీ మనింటికి అప్పుకోసం రాడే!"

"అది సరేలెండి—మనింట్లో పావుకేజీ కూడా ఉండదు—అదికాస్తా ఇచ్చేస్తే తర్వాత ఏది దారి మనకి? మళ్ళీ మీకే ఇబ్బంది కాఫీ లేకపోతే?"

"నిజమే! నిజమే! అంత కొంచెం ఉందని నాకు తెలీదుగదా?" అంటూ ఇవతలికి రాబోయి, మళ్ళీ వెనక్కి వెళ్ళి "పోనీ ఉన్న దాన్లోనే కొద్దిగా పొట్లం కట్టి ఇవ్వు!! వాడేం అనుకుంటాడో, లేదంటే?" అన్నాడు ఆచారి.

"మీ మొండితనమే మీది!

"పోనీ... కాఫీ ఉంటే ఇవ్వు! వాడేనా గొంతు తడుపుకుంటాడు." స్నేహితుడికి కాఫీ ఇవ్వాలన్న ఆపేక్షతో అడిగాడు ఆచారి.

"నాకేంగానా మతి ఉందిటండీ? ఉండా అంట?"

"ఎందుకే అలా అంటావు?"

"ఇంట్లో కాఫీకి పంచదార లేదని చెప్పబోతేలా కాఫీ ఇస్తానా? అతనేమనుకుంటారు?"

"నేనేం అనుకోను! నాగురించి మీరు గొడవ పడకండి! మీరంటే నాకింతదాకా ఉన్న ఆపేక్షని చెరిపేయకండి!" అనుకుని పంతులు అక్కడి నుంచి నడిచేడు.

"ఇప్పుడెక్కడికి వెళ్ళేది?" అనుకున్నాడు.

రోడ్డుమీద ఎర్రటి ఎండలో నుంచొని.

బుర్రలో నారాయణ మెదిలాడు. నారాయణ తన బళ్ళోనే ఒయిదోక్లాసు టీచరుగా పనిచేస్తున్నాడు. మనసు నిబ్బరం, మాట తీరుగా ఉన్నవాడు. ఒయిదుగురు కొడుకుల్ని పంచపాండవుల్లా కన్నవాడు!! అదీ నిప్పుడు అప్పు కొద్దో గొప్పో సద్దేవాడు!!!

అయితే నిమిషాల్లో నారాయణ ఇంట్లో ఉన్నాడు పంతులు. నారాయణ నవ్వి, పలకరించి, కుర్చీవేసి పేపరు అవాళది తెచ్చిచ్చేడు. మర్యాద బాగా చేస్తాడు నారాయణ— అని సంతసించుకుంటూ ఎప్పుడూ అవాళ మాత్రం కాఫీ పడని చికాకుతో తిరుగుతున్న మనసుతో 'ఈ నారాయణ అప్పం సెగాన్లో మంచి లాడిలామర్యాద చేస్తున్నాడు! కుర్చీ, పేపరు ఇచ్చాడు ఓ టిప్పటి కూడా పడితే సరి!', అని అనుకున్నాడు కోసంగా....

వచ్చిన పని చెప్పేడు నారాయణకి.

"క్షమించాలి, గురూగారూ!" అన్నాడు నారాయణ చిరునవ్వుతో.

గుండెల్లో గుండు పడినట్టయింది పంతులుకి.

"ఈ నెలలో చుట్టాలు నిరంతరంగా వస్తున్నారు! ఇదిగో! నిన్నే వాళ్ళు వెళ్ళిపోయారండి! బడ్జెట్ అంతా పోయింది మాష్టారూ!! ఇవాళ్టినించీ పస్తు కాదు కాఫీ, టిఫిన్లు ఎత్తిగట్టేసేం..."

పంతులు నీరసంగా లేచేడు. అడుగులో అడుగేస్తూ నడిచేడు. నారాయణ క్షమించమంటున్నాడు. క్షమించే ఔదార్యం తనకి ఉందా? అది కాఫీ పడితేనే వస్తుందేమో! ఇంక మరెట్లా క్షమించేది!

ఆర్తత్రాణపరాయణు దెవరింక?

ఎనిమిదే నిమిషాల్లో సుబ్బిసెట్టి దుకాణం దగ్గర వాలేడు.

అప్పటికే పొద్దెక్కింది, బాగా! సెట్టి దుకాణం రద్దీగా ఉంది. సెట్టి సరుకులమ్ముతూ, శ్రేయోభిలాషులతో మాట్లాడుతూ, నాలుగు పక్కలా చూపులు విసురుతున్నాడు!!

పంతుల్ని చూసీచూడనట్టు చూసి తల తిప్పుకున్నాడు!! పంతులు గుండె జారినట్టయింది.

సెట్టి సవితి చూపుకి అర్థం ఇంకేమీ కాదు. ఇప్పటికే సెట్టి కివ్వాల్సిన బాకీ ఏభం ఎన్ని రూపాయల వందా మూడు పైసలు!... ఆ నెల కా నెల తీర్చేస్తా, సంటానే ఒయిదు రూపాయిలెగ్గరున్న అప్పు ఇంతదాకా పెంచీసేడు! సెట్టి ఈ నెల బాకీ విషయం నవ్వుతూ కదిపి— తర్వాత నెల కొంచెం కటుగ్గా, ఆపైన— మరుసటి మాసం కొట్లో బల్లగుద్ది అడిగి ఆపైన అరవడంలోకి దిగేడు!!

హాం —వసుదేవుడు గాడిదకాళ్ళు పట్టుకున్నట్టు చేతులు పుచ్చుకొని బతిమాలితే... సవితి చేష్టల్లోకి దిగేడు!! ముక్కడం, మూలగడం, ఉలికిగా చూడ్డం, కొంటె వెధవ మాటలాడ్డం!!

సుబ్బిసెట్టి నెలా పలకరించడం??

నెత్తిని బద్దలు కొడుతున్న ఎండ కంటే— పేగుల్ని కన్నె కన్నెమనిపిస్తున్న కాఫీ బాధకంటే— వయసు, చికాకులు వంట్లో జవసత్వాల్ని పుడిగివేసే కష్టం కంటే— ఆ ప్రశ్న పంతులు నిప్పుడు కలత పెడుతున్నాది—

"సెట్టీ..." పిలిచేడు. అలా మరి ఒయిదుసార్లు పిలిపించుకునిగాని సెట్టి ఇటు చూడలేదు. చూసేక అప్పటిదాకా ముఖం మీదున్న ప్రసన్నతని ఠక్కుమంటుగా చెరిపేసుకుని, చిరాకుని పులిమేసుకుని, కనుబొమ్మలు క్వొశ్చన్‌మార్కుల్లా ఎత్తేడు....

"ఓ పావు కేజీ ... పంచదారివ్వు."

సెట్టి సీరియస్‌గా చూసేడు. పంతులు మళ్ళా అడిగేడు. సెట్టి అట్టాగే చూసేడు. పంతులు అర్థించేడు. సెట్టి కరగలేదు. పంతులు వేడుకున్నాడు... సెట్టి చెయ్యి ఎత్తేడు-అంతలో పంతులు తుళ్ళిపడ్డాడు. సెట్టి తనని శత్రువులాగా చూస్తున్నాడు!! చెయ్యి ఎత్తుతున్నాడేమిటి? కృష్ణుడిలా చక్రాన్ని తీస్తాడా?! పోలీసులా తుపాకి తీస్తాడా?! గూండాలా కత్తి తీస్తాడా?!....

సెట్టి అవేవీ తియ్యలేదు. మీద వేలాడుతున్న చిన్న బోర్డుని చూపించాడు పంతులికి.

"ఇచ్చట అరువులు ఇవ్వబడవు."

"నిన్ననే కట్టేం.. మీలాంటోళ్ళ కోసమే" అనేసి తన పనిలో పడిపోయేడు సెట్టి.

చాలది చాలామాట ఒక్కటి చాలు, గూండా కత్తి కంటే— పోలీసు తుపాకి కంటే— కృష్ణుడి చక్రం కంటే—

అయినా పంతులు మొండివాడు రాజుకంటే బలవంతుడు అన్నట్టు— మొండిగా సెట్టిని పంచదారివ్వమని పావుగంటసేపు, పావుకేజీ కోసం పడరాని బాధ మింగుతూ, అడిగా డడిగా డడిగాడలిసిపోయాడు.

కాళ్ళీడ్చుకుంటూ తిరిగేడు. ఎక్కడెక్కడో, వెర్రిగా ... తేలిపోతున్న అడుగుల్తో ఇంటికి చేరుకున్నాడు. లోపల్నించీ పెద్ద పెట్టున మాటలూ, నవ్వులూ!! అదేమిటది మాణిక్యం గొంతే అది? అంత కులాసా ఎలా వచ్చింది?! అంత నిబ్బరం ఎక్కణ్ణించొచ్చింది?!

పంతుల్ని చూసి, మాణిక్యం అంది. "మీరు ఇలా వెళ్ళారా? మన అమ్మాయీ, అల్లుడూ, పిల్లలూ అలా వచ్చేరు!" అంతలో అల్లుడు మావగారిని పలకరించి, ఆఫీసు పనిమీద అవూరికి వారం రోజులు వచ్చినట్టు చెప్పేడు...

మాణిక్యం భర్త చెయ్యి పుచ్చుకుని, వంట గదిలోకి తీసుకు వెళ్ళింది. ప్లేటుతో ఉప్మా, మంచినీళ్ళు ఇచ్చింది.

"తినండి! కాఫీ వెచ్చపెట్టి ఇస్తాను...ఏం చేయమంటారు? అమ్మాయిని డబ్బు అడిగి పుచ్చుకుని బాబిగాణ్ణి పక్కవీధి కొట్టుకి పంపించి, ఉప్మానూకా, పంచదారా అవీ తెప్పించేను... ఆ గుక్కెడు గొంతులో పడిందాకా, అదేమిటో వాళ్ళతో సరిగ్గా మాట్లాడలేక పోయానండీ!"

భార్యని తేరిపార చూస్తూ పొద్దున నించీ తను పడిన కష్టాన్ని చెప్పబోయి, చెప్పలేక మింగుతూ, ఉప్మా కింద గొంతులో ఆ కష్టాన్ని దించేసేడు పంతులు. ★

# ఆయుధ పూజ

ఏభై ఏళ్ళ క్రిందట అతడు
మధ్యందిన మార్తాండునిలా
ప్రజ్వలించాడు
తుఫానులా ఘోషించాడు
స్రోతస్వినిలా పరుగెట్టాడు!
నినదించాడు జలపాతంలా
గర్జించాడు మృగరాజంలా!
కా. ఖాళీ చేతులతో
కృశించి అస్థిపంజరమైన శరీరంతో-
లలాట రేఖపై మాత్రం
అచంచల ఆత్మవిశ్వాసం ఒక ప్రభారేఖ!
నశ్మేష దీక్ష ఒక కాంతిరేఖ!
అతడి వెనుక
హోరున గర్జిస్తూ జన సముద్రం
పడుతూలేస్తూ ఉరుకుతూ జన సముద్రం
అతడు వెనక్కి తిరిగి ఒకటి రెండుసార్లు
జనతా జనార్దుల్ని వీక్షించాడు
వారా అనదలు అర్భకులు
వారా అలుగులు, సెలుగులు, పలుగులు!
అతడు వారిపై ఒక మాట విసిరి
తొందరగా వెళ్ళిపోయాడు
అందులో సత్యం, అహింస, ప్రేమ!
అప్పటినుండి వాటికి ఆయుధపూజ
జరగనేలేదు!
వాటి అజ్ఞాతవాస చెరవిడనేలేదు!

- శశికాంత్ శాతకర్ణి